క్లుప్తంగా

డంపింగ్ యార్డును తొలగించాలి



వివరాలు తెలుసుకుంటున్న సునీల్‌రెడ్డి

ముత్తారం: ముత్తారంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి సందర్శించారు. కేజీబీవీలో 53మంది బాలికలు అస్వస్థతకు గురికావడానికి గల కారాణాలు స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను, సెప్టిక్ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కేజీబీవీ పక్కనే ఉన్న డంపింగ్ యార్డు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు స్పందించి బాలికల అస్వస్థతకు గల కారాణలు తెలుసుకొని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులు బిరుదు గట్టయ్య, పెయ్యాల కుమార్, ఎర్రవెల్లి హరీశ్‌రావు, మూగ మల్లేశ్, మారం శ్రీనివాస్‌రెడ్డి, దేవునూరి కొమురయ్య, కెక్కర్ల మహేశ్, ప్రశాంత్‌గౌడ్, మల్లయ్య, రాజమల్లు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం కృషిచేయాలి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌గౌడ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యం ఎంచుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. బాలికల కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ అధికారి డి.కల్పన, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ సంజీవయ్య, రామగుండం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన నిరుపేద బొమ్మెనవేని రాజు ఇటీవల అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ రాజు అతడి కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలలో విద్యార్థులకు ప్రస్తుత పోటీలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేలా నూతన ఆవిష్కరణలపై సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఏవో పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీటెక్ ఈవెనింగ్ కాలేజీకి అనుమతి..

మదర్‌థెరిసా ఇంజనీరింగ్ కాలేజీకి బీటెక్ ఈవెనింగ్ కాలేజీలో మెకానికల్ బ్రాంచ్‌లో తరగతులు నిర్వహించేందుకు అనుమతి లభించిందని కళాశాల చైర్మన్ నవీన్‌కుమార్, డైరెక్టర్ నవత, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. డిప్లొమా మెకానికల్ చదివి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం చేసుకుంటున్న వారు నవంబర్ 7న హైదరాబాద్ జేఎన్‌టీయూలో విద్యార్హత, పనిచేసే కంపెనీ అనుమతి పత్రంతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో మహిళా రైల్వే ఉద్యోగులు

రామగుండం: డిసెంబర్ తొలి వారంలో దక్షిణ మధ్య రైల్వేలో జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రామగుండంలో దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ తరఫున రైల్వే మహిళా ఉద్యోగులు పనిస్థలాల్లో ప్రచారం చేపట్టారు. రాబోయే ఎన్నికల్లో ఎంప్లాయిస్ సంఘ్ (కాంగ్రెస్ అనుబంధం) రైలింజన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీ సీట్లు సాధించాలని వారు కోరారు. ప్రచారంలో రామగుండం సంఘ్ బ్రాంచి సహాయక కార్యదర్శి సత్యవాణి, మహాలక్ష్మి, రజినీ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ప్రకటించారు. ఉత్తర్వు కాపీ మంగళవారం అందజేసి వారిని సన్మానించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, రాజకీయ రంగాల్లో ముందు వరుసలో నిలవాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎలువాక రాజయ్య, గాజుల రాజమల్లు, ఉప్పు రాజు, రామస్వామికి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: మాట్లాడుతున్న సీఐ సుబ్బారెడ్డి



కమాన్‌పూర్: కార్డన్ సెర్చ్‌లో మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: కాలనీలకు గుర్తుతెలియని వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి కోరారు. పట్టణంలోని మార్కండేయ కాలనీలో మంగళవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలనీల్లో గుడుంబా, నాటుసారా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పలు వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాహనంపై నంబర్ రాసుకోవాలని సూచించారు. సరైన ధృవపత్రాలు లేని 44 వాహనాలు సీజ్ చేసి జరిమానా విధించారు. సుల్తానాబాద్, జూలపల్లి, పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్సైలు శ్రవణ్‌కుమార్, నరేశ్, వేణుగోపాల్, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీధర్, సర్కిల్ పరిధిలో ఉన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కమాన్‌పూర్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాదరావు అన్నారు. మండలంలోని జూలపల్లి గ్రామ పరిధిలోని ముల్కలపల్లిలో మంగళవారం కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా సోదాలు నిర్వహించారు. ధృవపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఫోన్ వినియోగిస్తున్న ప్రతీఒక్కరు వారికి వచ్చే కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



జ్యోతినగర్: ఓటరు జాబితా అందిస్తున్న తహసీల్దార్ కుమారస్వామి

సుల్తానాబాద్: ఇంటింటా సామాజిక కుటుంబ సర్వేలు పకడ్బందీగా సిబ్బంది నిర్వహించాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో కార్యదర్శులు సిబ్బందితో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 150 ఇళ్లకు ఒకరిని అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మద్దసూదన్‌రెడ్డి, ఎంపీవో సమ్మిరెడ్డి, ఎంపీడీవో సూపరింటెండెంట్ ఫక్రుద్దీన్, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కులగణనపై ఎన్యూమరేటర్లకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ వాసంతి, ఎంపీవో భాస్కర్, ఏఎస్‌వో శ్రీవాణి పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీవో అనిల్‌రెడ్డి సర్వేపై శిక్షణ నిర్వహించారు. తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: సమగ్ర కులాల స్థితిగతుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రామగుండం తహసీల్దార్ కె.కుమారస్వామి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజలింగం, సీడీపీవో అలేఖ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, టీపీఎస్ నవీన్, మున్సిపల్ ఆర్‌ఐ శంకర్‌రావు, కరుణాకర్, రెవెన్యూ ఆర్‌ఐ ఆలీ, ఏఎస్‌వో సమత పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎంపీడీవో భాస్కర్‌రావు కులగణనపై ఎన్యూమరేటర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు.

ఓదెల: ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్ ఆధ్వర్యంలో కులగణన గురించి వివరించారు.

ముత్తారం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సురేశ్ ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పించారు.

మంత్రికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండంలో రుడా ఏర్పాటుకు కృషిచేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు పోతన కాలనీ చౌరస్తాలో కాలనీ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. రామగుండం నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేశ్, శంకర్ నాయక్, జక్కుల దామోదర్‌రావు, తిరుపతిరెడ్డి, యాదగిరి తిరుపతి, మార్క రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరామర్శ



పరామర్శిస్తున్న పుట్ట మధు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ముత్తారం మండల కేంద్రంలో గల కేజీబీవీ విద్యార్థులు అస్వస్థతకు గురై పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని మంగళవారం జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధుకర్ పరామర్శించారు. పాఠశాలలో పెరిగిన గడ్డికి పురుగుల మందు కొట్టించారని, ఆ గడ్డిని పనిష్మెంట్ పేరిట విద్యార్థులతో తొలగించే పనులు చేపట్టడంతో అస్వస్థతకు గురయ్యారని పుట్ట మధు ఆరోపించారు. చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన పేద విద్యార్థులపై చిన్నచూపు చూడడం తగదన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పెద్దపల్లిరూరల్: పట్టణంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్రవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 124 మంది హాజరయ్యారని క్లబ్ అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. వారిలో 80 మందికి శస్త్రచికిత్స అవసరమున్నట్లు గుర్తించిన వైద్యులు 43మందిని రేకుర్తి ఆసుపత్రికి తరలించారు. త్వరలోనే మిగతా 37మందిని తీసుకెళ్లి ఆపరేషన్ చేయించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. రాంకిషన్, సత్యనారాయణ, సంపత్‌రావు, సుష్మ, రాజగోపాల్, శశాంక, ప్రసాదరావు, రాంచంద్రారెడ్డి, మహేందర్‌రావు, శ్రీనివాస్ ఉన్నారు.

ట్రినిటిలో ఆగమనం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లిరూరల్: ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీ బీటెక్ విద్యార్థులు మంగళవారం ఆగమనం 2కె24 పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అకడమిక్ చైర్మన్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ చదువు పూర్తయ్యేలోగా ఉద్యోగం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏవో రాజిరెడ్డి, సురేశ్, నటరాజన్, ప్రభాకర్, స్వాతి, పద్మిని, ఆరిఫ్ ఉన్నారు.

నిత్యావసరాలు అందజేత

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలో షుగర్ వ్యాధితో కాలు కోల్పోయిన నిరుపేద ఆటో డ్రైవర్ కండె రామస్వామికి మంగళవారం శ్రీసీతారామ సేవాసమితి సభ్యులు చేయూతనిచ్చారు. స్థానిక సంజయ్‌నగర్‌కు చెందిన రామస్వామికి కుటుంబ పోషణ భారంగా మారడంతో విషయం తెలిసిన సేవాసమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ సూచన మేరకు సలహాదారులు శ్రీరామోజు చంద్రమౌళి రూ.2,500 ఇవ్వగా, సేవాసమితి గ్రూపు సభ్యుల నుంచి రూ.2.500 సేకరించారు. మొత్తం రూ.5వేలతో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు బాధిత కుటుంబానికి అందజేశారు. సేవాసమితి సభ్యులు కంది సుజాత, మెడగోని స్వప్న, గాదం సరిత, లక్ష్మి, కొండు రమాదేవి, కొప్పుల శ్రీనివాస్, కాలనీవాసులు నర్సింగ్, సంతోష్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఓదెల: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని పెద్దపల్లి సొసైటీ మానిటరింగ్ ఆఫీసర్ ముసాఫర్ అహ్మద్ సూచించారు. మండలంలోని పొత్కపల్లి సొసైటీలో మంగళవారం నిర్వాహకులతో సమావేశం జరిగింది. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, సీఈవో అంజిరెడ్డి పాల్గొన్నారు.

భూగర్భజలాల నిర్వహణపై చిత్రలేఖనం పోటీలు

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంట జిల్లా పరిషత్ పాఠశాలలో భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు భూగర్భజలాల నిర్వహణ, అభివృద్ధి అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. భూగర్భ జలశాఖ అధికారి లావణ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

• **మీర్జంపేట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్**

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేట పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాస్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు 28న విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

• **చికిత్స పొందుతూ ఒకరి మృతి**

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలో మార్కండేయ కాలనీకి చెందిన కోట తిరుపతి(50)అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోగా సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై(రెండో) వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం తిరుపతి మద్యానికి బానిసై ఏం పని చేయడం లేదు. కుటుంబసభ్యులు ఈనెల 27న మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. తిరుపతికి భార్య లక్ష్మి, కొడుకు సాగర్ ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

• **సింగరేణి కార్మికుడికి గాయాలు**

రామగిరి: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణం ఎదురుగా బైక్‌పై వెళ్తున్న నాగెపల్లికి చెందిన వేగోలపు శ్రీనివాస్(42)ను ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అందించి గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

• **వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు**

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గోదావరిఖని కేసీఆర్ కాలనీకి చెందిన రాములు ఎన్టీపీసీ రామగుండం ప్లాంటులో విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వాహనంపై వెళ్తుండగా పోలీస్ కమిషనరేట్ రాజీవ్ రహదారిపై వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో తలకు తీవ్ర గాయాలైన రాములును 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. అతడి వద్ద లభించిన రూ.36,600 ఆయన కుటుంబసభ్యులకు 108 ఈఎంటీ రవీందర్, పైలట్ కుమార్ అందించారు. ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న భూమక్కను కారు ఢీకొన్నది. చికిత్స నిమిత్తం ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

• **విద్యార్థుల ఆరోగ్యం కోసమే ఐరన్ హెల్త్ చైల్డ్ ప్రాజెక్టు**

మంథని: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసమే ఐరన్ హెల్త్ చైల్డ్ ప్రాజెక్టు అని రోహిణి ఫౌండేషన్ అధినేత సంపత్‌రెడ్డి అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో క్యాంపు విజయవంతం అయిందన్నారు. విద్యార్థులకు పరీక్షలు ముగిసిన తర్వాత పాఠశాలల్లో డెంటల్, ఐరన్ హెల్త్ చైల్డ్ ప్రాజెక్టు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

• **కులగణన సర్వేలో మినహాయింపు ఇవ్వాలి**

జ్యోతినగర్: కులగణన సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్ విధులకు రామగుండం కార్పొరేషన్ నుంచి సీఆర్పీలకు మినహాయింపు ఇవ్వాలని రామగుండం తహసీల్దార్ కుమారస్వామికి సీఆర్పీలు మంగళవారం ఎన్టీపీసీ రామగుండంలో జరిగిన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు.

• **నవంబర్ 11 నుంచి స్మారక క్రీడాపోటీలు**

మంథని: మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడారంగ పూర్వ గేమ్స్ సెక్రటరీ మజారుద్దీన్ స్మారక క్రీడా పోటీలు నవంబర్ 11 నుంచి 13 వరకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి తెలిపారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నవంబర్ 5లోగా ఎంట్రీలను మంథని విద్యార్థి యువత పేరున పంపాలని సూచించారు.

• **డిప్యూటీ తహసీల్దార్ బదిలీ**

ఓదెల: ఓదెల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన అనిల్‌కుమార్ జూలపల్లికి మంగళవారం బదిలీ అయ్యారు. రామగుండంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ఓదెలకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

• **సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన**

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయంలో మంగళవారం షీటీం పోలీసులు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. షీటీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ మహిళలను ఎవరైనా వేధిస్తే వెంటనే 63039 23700 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

• **టెండర్లలో అక్రమాలపై విచారణ జరపాలి**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీలో డిఆర్‌సీ సెంటర్ల నుంచి వ్యర్థాలను సేకరించే టెండర్లలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి, నాయకుడు సురేందర్ సన్నీ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకుని మళ్లీ టెండర్లు నిర్వహించాలన్నారు.

• **గాలికుంటు నివారణ టీకా తప్పనిసరి**

ఎలిగేడు: పశువుల్లో రోగ నిరోధకశక్తిని పెంచేందుకు గాలికుంటు నివారణ టీకా తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి ఝాన్సీ అన్నారు.



కమాన్‌పూర్: మండలంలోని లింగాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న పంట పొలంలో విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ తీగలు కిందికి ఉండడంతో పొలం కోసే సమయంలో వరికోత మిషన్‌కు తాకి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

పుష్కరఘాట్ స్థలం పరిశీలన



పుష్కరఘాట్ స్థలం కొలతలు తీసుకుంటున్న సింగరేణి సివిల్ అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామం, గోదావరి నదీ తీర ప్రాంతమైన రామగిరి మండలం ముస్త్యాలలో పుష్కరఘాట్ నిర్మాణం కోసం మంగళవారం ఆర్జీ–1 ఏరియా సింగరేణి సివిల్ అధికారులు స్థలం పరిశీలించారు. కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్, గ్రామ మాజీ సర్పంచ్ లావణ్య గ్రామానికి పుష్కరఘాట్ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పుష్కరఘాట్ నిర్మించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. మంత్రి వెంటనే ఆర్జీ–1 సింగరేణి జీఎంకు తెలిపినట్లు లావణ్య చెప్పారు. స్పందించిన జీఎం సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సూచించడంతో సివిల్ సిబ్బంది మంగళవారం గ్రామానికి చేరుకొని పుష్కరఘాట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. మాజీ సర్పంచ్ మంత్రికి, జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1లో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ సాదిక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తోటి కార్మికులు మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్మికులందరూ కలిసి జమచేసిన రూ.1,37,000 నగదును మంగళవారం యైటింక్లయిన్‌కాలనీలో నివాసం ఉంటున్న కార్మికుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు గద్దం తిరుపతియాదవ్, డిటి రావు, మల్లారెడ్డి, మల్లేశ్, మురళీధరన్, చంద్రమౌళి, వీరయ్య, ఓదయ్య, రవీందర్, ఎస్‌కె మీరా పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారుడికి ఆర్థిక ప్రోత్సాహం



నగదు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఇదులాపూర్ గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు బాల్త సాహితికుమార్ తండ్రి రవికి ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం రూ.10వేలు నగదు మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ద్వారా అందించారు. సాహితికుమార్ ఇటీవల డొమెస్టిక్ ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. శ్రీలంకలో నిర్వహించనున్న అండర్–19లో మన దేశం తరఫున పాల్గొంటున్న సాహితికుమార్ అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, నాయకులు మునీర్, దేవేందర్, మాదాసు సతీశ్, బద్రి, బొడ్డుపెల్లి సాయి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పాత వస్తువుల అమ్మకానికి చర్యలు

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని పాతవస్తువుల అమ్మకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాత వస్తువులను పరిశీలించి సీల్డ్ కవరులో కొటేషన్‌ను జీజీహెచ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. నవంబర్ 2 వరకు సమర్పించిన కొటేషన్లను నవంబర్ 3న సాయంత్రం 3గంటలకు తెరవనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దహన సంస్కారాలకు సాయం అందజేత



నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి: మండలంలోని రత్నాపూర్‌కు చెందిన తల్లీ, కూతురు విద్యుదాఘాతంతో మృతి చెందారు. కాగా వారి దహన సంస్కారాల కోసం కాంగ్రెస్ నాయకులు మంగళవారం రూ.25వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు బర్ల శ్రీనివాస్, అర్రెల్లి కొమురయ్య, తులసీరాంగౌడ్, తోట చంద్రయ్య, అవినాష్, శ్రీనివాస్, సత్యం, పోశం, రాజ్‌కుమార్, చక్రి ఉన్నారు.

ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్ ప్లాంటు ఏర్పాటును విరమించుకోవాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులోని వాటర్ ట్యాంక్ ఆవరణలో ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్ ప్లాంటు ఏర్పాటును మున్సిపల్ అధికారులు విరమించుకోవాలని కాలనీవాసులు డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావుకు వినతిపత్రం అందించారు. మంగళవారం వాటర్ ట్యాంక్ వద్ద కాలనీవాసులు డిప్యూటీ మేయర్‌తో మాట్లాడారు. ఆయన స్పందించి నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్‌తో దూరప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. జానకిరాం, ఉపేందర్, భిక్షపతి, గోపాల్, రాజయ్య, పుల్లూరి వెంకటేశ్వర్లు, దాడి శ్రీనివాస్, మల్లారెడ్డి ఉన్నారు.

అనారోగ్యంతో పూజారి మృతి

ఎలిగేడు: మండలంలోని రాములపల్లి (ర్యాకల్‌దేవుపల్లి)నాగలింగేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకునిగా పనిచేస్తున్న సుల్తానాబాద్‌కు చెందిన రామ్మూర్తిశర్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపై మండల ప్రజలు విచారం వ్యక్తం చేశారు.